ఎవరిని గెలిపిస్తారో..?

మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో ఓటేసిన 19 లక్షల మంది

- గెలుపోటములను ప్రభావితం చేయనున్న మైనార్టీల ఓట్లు
- మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో సర్వత్రా ఇదే చర్చ
- బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ అంటున్న పలువురు

నిజాంపేట్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గంలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీల ముగ్గురు అభ్యర్థుల గెలుపోటములను ముస్లిం ఓటర్లు ప్రభావితం చేయనున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మా రెడ్డిలు ప్రధానంగా పోటీ పడి ప్రచారం నిర్వహించి ప్రజల మద్దతు పొందేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఇక్కడ పోటీ ఇద్దరి మధ్యనా లేక ముగ్గురి మధ్యనా అనే దానిపై రాజకీయ విశ్లేషకులు రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉందని కొందరు లేదు ముగ్గురు మధ్య పోటీ ఉంటుందని ఇంకొందరు అంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరగడం మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో హాట్ టాపిక్‌గా మారింది.

◆ దేశంలోనే అత్యంత ఎక్కువగా ఓటర్లు ఉన్న లోక్‌సభ స్థానం మల్కాజిగిరి కావడంతో ఇక్కడి ఎన్నికపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నియోజకవర్గంలో సుమారు 38 లక్షల ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 50 శాతానికి పైగా సుమారు 19 లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరి ఈ పోలైన ఓట్లలో ఎవరు ఎక్కువగా ఓట్లు సాధిస్తారో అనే లెక్కలు మాత్రం అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

బీఆర్ఎస్‌కు నాటి ఆదరణ లభించేనా..?

◆ బీఆర్ఎస్ పార్టీకి అంసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కాంగ్రెస్, బీజేపీలను కాదని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలుపొందారు. మరి ప్రస్తుతం మారి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి పట్టం కడతారా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

పోల్ మేనేజ్‌మెంట్‌లో పోటీ పడ్డా కాంగ్రెస్, బీజేపీలు..


◆ ఎన్నికల ప్రచారం ఒక ఎత్తు కాగా పోల్ మేనేజ్‌మెంట్ మరో ఎత్తు ఈ ఎత్తులో పై చేయి సాధించేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్రంగా పోటీపడ్డాయి. లోక్ సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని బస్తీలపై కాంగ్రెస్ పూర్తిస్థాయి దృష్టి సారించి పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలో బీజేపీ కంటే ఒక అడుగు ముందు ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ సైతం కాంగ్రెస్‌తో పోటీపడి తన వంతు ప్రయత్నం తీవ్రంగానే చేసింది. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్, బీజేపీల తరువాత నిలిచిందని చెప్పవచ్చు.

బీజేపీ అభ్యర్థి ఈటల వైపు మొగ్గు..!

◆ మల్కాజిగిరి నుంచి బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ వైపు ప్రజల మొగ్గు చూపారా అనేది మాత్రం అంతు చిక్కడం లేదు. కొంత సానుకూలత అయితే ప్రజల నుంచి లభించినట్లు కనిపించింది. మరి ఆ సానుకూలత ఓట్ల రూపంలో మళ్లిందా లేదా? అనేది చూడాలి. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీ, ఉత్తర భారతీయులు, క్లాస్ ఓటర్లపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. అదే విధంగా యువత సైతం బీజేపీకే ఓటు వేశారని అంచనాలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

సీమాంధ్రులు ఓటేయకపోవడం ఎవరికి నష్టం.. ఎవరికి లాభం..?

◆ ఈ నెల 13న తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఎన్నికలు ఉండటంతో మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో నివాసం ఉండే సీమాంధ్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వేసేందుకు వెళ్లారు. ఇక్కడ ఓటు వేయలేదు. ఇలా ఇక్కడ ఓటు వేయకపోవడం వల్ల ఎవరికి నష్టం.. ఎవరికి లాభం అనే అంశంపై అభ్యర్థులతో పాటు నాయకులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వెళ్లిన వారంతా బీజేపీకి ఓటు వేసే వారని కాంగ్రెస్ వారు భావిస్తున్నారు. బీఆర్ఎస్‌కు వేసేవారని బీజేపీ వారు భావిస్తున్నారు.



మైనార్టీల ఓట్లు ఏ పార్టీకి..?

◆ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కేవలం మైనార్టీల ఓట్లు సుమారు 5 నుంచి 6 లక్షల వరకు ఉంటాయనేది అంచనా. ముస్లిం ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఏవరి వైపు మొగ్గు చూపరనేది ప్రస్తుతానికి చర్చ జరుగుతుంది. అయితే ఎంఐఎం అధినేత సైతం లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు అందరు హైదరాబాద్ లోక్‌సభ స్థానం మినహా అంతటా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని చెప్పిన విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది.

◆ మైనార్టీలు వంద శాతం బీజేపీకి వ్యతిరేకంగానే ఓటు వేశారని అందులో మెజార్టీ కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేసి ఉండొచ్చని... .ఇక క్రిష్టియన్ ఓటర్లు సైతం బీజేపీకి వ్యతిరేకంగానే ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. క్రిస్టియన్ ఓటర్లు సైతం మల్కాజిగిరి ఎంపీ స్థానం పరిధిలో 3 నుంచి 4 లక్షల మధ్యలో ఉంటారని క్రిష్టియన్ సంఘాలు పేర్కొంటున్నాయి.

◆ ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లలో ఎంత మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నరనేది సైతం ప్రధాన అంశం. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని. రిజర్వేషన్లు తొలగిస్తారని విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే ఏ వర్గం ఓటర్లు ఏ పార్టీని ఆదరించారనేది ఎన్నికల ఫలితాల రోజు తేలాల్సి ఉంది.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


సోనియాగాంధీనగర్ ఫేస్-1 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ సోనియాగాంధీ నగర్ ఫేస్–1 కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణస్వీకారం చేసింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్యామల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి పలుగుల గోపాల్, ఉపాధ్యక్షులు పారుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా మోడెం రాజు, చింతల వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా కలమట శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ మహిళలు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి, పజ్జూరి పావనీరెడ్డి, చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, నాయకులు నేమూరి మహేష్‌గౌడ్, వంశరాజ్ మల్లేష్, సీతారాంరెడ్డి, రాములు యాదవ్, పలుగుల మహేందర్, బాల నరసింహగౌడ్, సిద్దుగౌడ్, సాబాద్ దామోదర్‌రెడ్డి, పలుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ఘనంగా చందనోత్సవం




మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు ప్రభాత ఆరాధన, విశ్వక్సేన ఆరాధన, అనంతరం 108 కలశాలతో మూలవిరాట్‌కు శతఘటాభిషేకం, 108 లీటర్ల పాలు, పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం చందనంతో అలంకరించి చందనసేవ నిర్వహించారు. ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి, క్లర్క్ సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ఉప్పల్: పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను ఉప్పల్ సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన కమ్యూనిస్ట్ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం. వినోద, నాయకులు జె.వెంకన్న, బీష్మాచారి, ఉపేందర్, వెంకటేష్,అంజానేయులు ఊర్మిళ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



మల్కాజిగిరి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి సీపీఎం కార్యాలయం, మౌలాలి పిల్లి నర్సింగరావు కాలనీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు మురళిమోహన్, నారాయణ రెడ్డి, కృపాసాగర్, ప్రభాకర్ తదితరులు సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. పేద బడుగు బలహీన వర్గాల తరుపున పోరాటం చేసిన యోధుడిగా చరిత్రలో నిలిచిపోయారని ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. పిల్లి నర్సింగరావు కాలనీలో మౌలాలి డివిజన్ కార్యదర్శి మంగ తదితరులు నివాళులు అర్పించారు.

సరస్వతి కాలనీ అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న సుధాకర్ రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ సరస్వతి కాలనీ అధ్యక్షుడిగా సీహెచ్. సుధాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆయన కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా టి. రజినీష్ రెడ్డి, కోశాధికారిగా విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె. లక్ష్మీ రెడ్డి, కె. వాసుదేవ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జి. ప్రీతం రెడ్డి నియమితులయ్యారు. సరస్వతీ కాలని వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఎన్నికలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరితో పాటు నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

దొరికిన సెల్‌ఫోన్ అప్పగింత


గౌతమ్‌కు సెల్‌ఫోన్ అందిస్తున్న రాఘవేందర్‌గౌడ్

కాప్రా: ఎల్లారెడ్డిగూడకు చెందిన బైరి రాఘవేందర్‌గౌడ్‌కు శనివారం కాప్రాలో జరిగిన మార్కెట్‌లో ఓ సెల్ ఫోన్ దొరికింది. దీంతో అతను ఫోన్ పోగొట్టుకున్నవారు తనను సంప్రదించాలని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దానాని గమనించిన సాకేత్‌కు చెందిన గౌతమ్ అనే వ్యక్తి రాఘవేందర్‌గౌడ్‌ను సంప్రదించడంతో వివరాలు తెలుసుకుని సెల్‌ఫోన్ అప్పగించాడు. నిజాయితీని చాటుకున్న రాఘవేందర్‌గౌడ్‌ను పలువురు అభినందించారు.

‘మల్కాజ్‌గిరి పార్లమెంట్ సీటు మనదే’


పట్నం సునీతారెడ్డితో మోహన్ తదితరులు

మల్లాపూర్: అన్ని వర్గాల ప్రజల ఆదరణతో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని గెలువబోతున్నామని మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్, లోకసభ ఎస్సీసెల్ ఇన్‌చార్జి హెచ్ఆర్. మోహన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకురాలిగా కాకుంగా సేవకురాలుగా పనిచేస్తానని తెలిపారు. తన గెలుపు కోసం కష్టపడిన కార్య కర్తలకు, నాయకులకు కృతజ్ఞతాలు తెలిపారు. కార్యక్రమంలో బండారి రఘు, ఏర్పుల జంగయ్య, కొంగరి కుమార్, మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జమ్మిగడ్డలో జ్ఞానమాల కార్యక్రమం


లోతుకుంటలో..


మహనీయులకు నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

కాప్రా: జమ్మిగడ్డ జ్ఞానమాల బృందం ఆధ్వర్యంలో ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాడూరి గగన్‌కుమార్, ఎస్ఏ రహీం, నర్సింహాచారి, నరేందర్‌రావు, దయానంద్, రవినాయక్, కొండల్, సాయిలు, సత్తయ్య, స్వామి పాల్గొన్నారు.

లోతుకుంటలో..

అల్వాల్: జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా లోతుకుంటలోని ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం జ్ఞానమాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యావంతుల వేదిక వైస్ ప్రెసిడెంట్ మామిడి నారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రతి ఒక్కరూ బీఆర్.అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, రమేష్, కన్నయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీబీఎస్ ర్యాలీ



మల్లాపూర్: మల్లాపూర్ ఐనోస్ చర్చి పాస్టర్ శాంత రాజు ఆధ్వర్యంలో ఆదివారం వీబీఎస్ (విరామ బైబిల్ పాఠశాల ర్యాలీ) నిర్వహించారు. వేసవి సెలవుల నేపథ్యంలో వారం రోజుల పాటు బైబిల్ క్లాసులు. ఏసు క్రీస్తు దేవుడు, వ్యాక కథలు, ఆటలు పాటలు నిర్వహించారు. అనతంరం మల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, పాస్టర్ సీహెచ్ఎస్ రాజు,పాస్టర్ స్టీఫెన్, పాస్టర్ విజయ్ కుమార్, సాయిల్, వసంత, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే.. చింత..

- తరచూ కాలనీలు జలమయం
- వరదలా పారుతున్న డ్రైనేజీ
- పట్టించుకోని అధికారులు
- ప్రజల అవస్థలు


ఈస్ట్ ఇందిరానెహ్రూనగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

గౌతంనగర్: వర్షం వచ్చిందంటే గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ప్రజలు భయంతో కాలం గడపాల్సి వస్తోంది. పలు కాలనీల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో కంటిమీద కునుకు కరువవుతోంది. దశాబ్దంగా సమస్య ఉన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ, రాజాశ్రీనివాసనగర్, రాజానగర్, పవన్ మోటార్స్, చిన్మయి మార్గ్, జ్యోతినగర్, హనుమాన్‌పేట్, గోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీలు పొంగి చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది దుర్వాసన వెదజల్లుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు ఆక్రమణలు, అక్రమ కట్టడాలే ఇందుకు కారణమని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రాజశ్రీనివాసనగర్ పవన్ మోటార్స్ సమీపంలో..


మిర్జాలగూడ చిన్మయిమార్గ్‌లో..

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధుడు

మల్కాజిగిరి: గణపతి మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆనంద్‌బాగ్‌లో సీనియర్ సిటిజన్స్ కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధుమేహం, రక్తపోటు, దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 156 మంది పరీక్షలు చేయించుకున్నట్లు సొసైటీ చైర్మన్ సంతోష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తరుణి, సొసైటీ ప్రతినిధులు మాధవరావు, భరత్‌కుమార్, ఉష, మాధవి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రినగర్ అధ్యక్షుడిగా మహేష్



మల్కాజిగిరి: మౌలాలి డివిజన్, గాయత్రీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కంటేకార్ మహేష్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో జనార్దన్‌రెడ్డిపై మహేష్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా మైఖేల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కాలనీ సంక్షేమానికి కృషి చేస్తానని, తనకు అవకాశం కల్పించిన కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి స్థాయిలో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు లోహిత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, రమేష్,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న నర్సింగ్‌రావు

మల్లాపూర్: బహుజన సమాజ్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నాచారం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మింద్రాల నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఆదివారం జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు ఇటికల అంబేడ్కర్ చేతుల మీదుగా ఆయన నియామకపు ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతాన్నికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ రవీందర్ నాయక్, జిల్లా ఇన్‌చార్జి గౌడ సుదర్శన్, మేడ్చల్ జిల్లా అసెంబ్లీ అధ్యక్షుడు శివకుమార్,జిల్లా నాయకులు మల్లేశం,శ్రీహరి,కనక బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ



అల్వాల్: అల్వాల్ అంబేడ్కర్‌నగర్ సిటిజన్ కాలనీలో ఉజ్జయినీ మహంకాళీ సహిత నల్ల పోచమ్మ దేవాలయంలో మహంకాళి అమ్మవారి పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా సాగిన ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా చండీయాగం, యంత్ర పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, సాయికుమార్, శ్యామ్, నవీన్, ఆనంద్, మధు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంజలి పెనుకొండ శిష్యబృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. తాండవ నృత్య కారి, మూషిక వాహన, రుక్మిణి ప్రవేశం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా శ్రీనాథ్


నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షునిగా బర్ల శ్రీనాథ్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శేఖర్‌గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ వీరభద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

మేడ్చల్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల కట్టడికి ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు గోదా అరుణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. అధిక ఫీజులు, డోనేషన్ల పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థలు నిరుపేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లాగా కార్పోరేట్ పాఠశాలలు, కళాశాలలు వెలుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో అమలు చేయాలని కోరారు.